ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 13 ఫిబ్రవరి 2024

రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 19: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వ ర్యంలో రాష్ట్ర స్థాయి అవార్డులకు నామినేషన్లు (దరఖాస్తులు) ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ఔత్సాహికులైన మహిళలు ఈనెల 17న సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం, బాలరక్ష భవన్, భగత్‌నగర్‌లో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

జిల్లా అధికారులందరూ 'ప్రజావాణి'లో పాల్గొనాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: జిల్లా అధికారులందరు ప్రజావాణిలో తప్పని సరిగా పాల్గొనాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక ్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మండ లంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కన్నం వెంకటయ్య 714 సర్వే నంబరులో ఉన్న తన భూమిని ఆక్రమించుకున్నారని, దానిని తనకు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మానకొండూరు మండలం ఊటూరు గ్రామానికి చెందిన రాజయ్య పెన్షన్ మంజూరు చేయాలని, చొప్పదండి మండల కేంద్రానికి చెందిన శారదకు మరుగుదొడ్డి మంజూరు అయిందని, దానికి సంబంధించిన డబ్బులు ఇప్పించాలని కోరారు. బెజ్జంకి మండలం తోటపల్లికి చెందిన శంకరయ్య తన ఆటోకు సంబంధించిన ఫైనాన్స్ డబ్బులు చెల్లించినప్పటికి సదరు ఫైనాన్స్ వారు తన ఆటోను తీసుకెళ్లారని కలెక్టర్ దృష్టికి తీసు కెళ్లాడు. తగిన చర్యలు తీసుకోవలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన దరఖాస్తుల్లో సీపీ కార్యాలయం-7, కరీంనగర్ మున్సిపాలిటీ-34, డీఈవో-3, కరీంనగర్ ఆర్డీవో-18, కరీంనగర్ రూరల్ తహసీల్దార్-11, కొత్తపల్లి తహసీల్దార్-10 ఇతర శాఖలకు సంబందించినవి 123 ఉన్నాయని తెలి పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్



జిల్లాలో భారీగా అధికారుల బదిలీలు

మూడేళ్లకు పైగా పని చేస్తున్న వారికి స్థానచలనం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో పనిచేస్తున్న వివిధశాఖల అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలుశాఖల్లో పనిచేస్తున్న జిల్లా, మండల స్థాయి అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా రాష్ట్రవ్యాప్తంగా 105 మంది జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీఆర్డీవో, అసిస్టెంట్ డీఆర్డీవో, డీపీవోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ప్రజాపరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా పని చేస్తున్న డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్‌ను వరంగల్ జడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. పెద్దపల్లి జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న ఎం శ్రీనివాస్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. కరీంనగర్ డీఆర్డీవో శ్రీలతను రంగారెడ్డి డీఆర్డీవోగా బదిలీ చేసి ఆమె స్థానంలో పెద్దపల్లి డీఆర్డీవో వి శ్రీధర్‌ను బదిలీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను రాజన్న సిరిసిల్ల జిల్లా డీపీవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజన్నసిరిసిల్ల డీపీవోగా పనిచేస్తున్న ఎ రవీందర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఇక్కడ పనిచేస్తున్న విజయభాస్కర్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేయగా, హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బేవరేజెస్‌లో పనిచేస్తున్న ఏసీ కె వరప్రసాద్‌కు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా రంగారెడ్డి జిల్లాలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డెవిడ్ రవికాంత్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే జిల్లాలోని 12 మంది మండల అభివృద్ధి అధికారులను, పలువురు తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. మూడేళ్లకు పైగా పని చేస్తున్న మరికొంత మంది వివిధశాఖల అధికారులు, ఉద్యోగులను కూడా బదిలీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒకటిరెండు రోజుల్లో దాదాపుగా అన్ని శాఖల్లో మూడేళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అవుతాయని భావిస్తున్నారు. బదిలీ అయిన అధికారులను 48 గంటల్లోనే రిలీవ్ చేయాలని కలెక్టర్లకు ఆదేశాలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవం

- రేపటి నుంచి అధ్యయనోత్సవం, 15 నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాలు
- 21న శోభాయాత్ర
- పూర్తయిన ఏర్పాట్లు..

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 12: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కరీంనగర్ మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 14 నుంచి 21 వరకు నిర్వహించ నున్నారు. ఉత్సవాల్లో తొమ్మిది వాహనసేవలు, సహస్రకలశాభిషేకం, దీపోత్సవం, శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం, చూర్ణోత్సవ, వసంతోత్సవ, చక్రస్నానాలు, శ్రీపుష్పయాగం, మహాపూర్ణాహుతి, కళాకారుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శోభాయాత్ర ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాయి.



విద్యుత్ కాంతుల మధ్య వేంకటేశ్వర ఆలయం

- కార్యక్రమాలు...

14న ఉదయం అధ్యయనోత్సవం, సాయంత్రం పరమపదోత్సవం, 15న ఉదయం 9 గంటల నుంచి అంకురార్పణలో భాగంగా పాతబజార్ గౌరీశంకరాలయం నుంచి పుట్టమన్ను తేవడం, మధ్యాహ్నం 12-30 గంటల నుంచి సహస్రకలశాభిషేకం, సాయంత్రం 5 గంటలకు పుణ్యాహవాచనం, రాత్రి 6-30 గంటలకు శేషవాహనం నిర్వహిస్తారు. 16న ఉదయం 8 గంటల నుంచి అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ, 9 గంటలకు సూర్యప్రభవాహనం, సాయంత్రం 6 గంటలకు చంద్రప్రభవాహనం, 17న ఉదయం 10 గంటలకు కల్పవృక్షవాహనం, అనంతరం పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో సారె సమర్పణ, సాయంత్రం 6 గంటల నుంచి అశ్వ, గజ వాహన సేవలతో ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక దేవాలయం నుంచి ఎదుర్కోలు ఉత్సవం ఉంటుంది. 18న ఉదయం 12.15కు శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు గరుడవాహనం, 19న ఉదయం 5 గంటలకు తిరుపతి పండితులచే సుప్రభాత, అన్నకూ టోత్సవ సేవలు, 9 గంటలకు సింహవాహనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ, రాత్రి 9 గంటలకు హనుమత్ వాహన సేవ నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటల నుంచి మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవ, వసంతోత్సవ, చక్రస్నానాదులు, సాయం త్రం 5 గంటల నుంచి పుష్ప యాగం, ధ్వజావరోహణ. 21న సాయంత్రం 5 గంటలకు మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి శ్రీవారి శోభాయాత్ర ఉంటుంది. ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం ప్రముఖుల ప్రవచనాలు, హరికథలు, భక్తి సంగీత విభావరులు, భజనలు, పారాయణాలు, నృత్య, నాటక ప్రదర్శనలు ఉంటాయి.



విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వాగతద్వారము

పవిత్ర హృదయంతో పాల్గొందాం.. రండి...

- మంత్రి పొన్నం ప్రభాకర్

ఉత్సవాల్లో పవిత్ర హృదయంతో రాజకీయాలు, రాగద్వేషాలకు అతీతంగా పాల్గొందాం. లోక కల్యాణం, జిల్లా ప్రజల క్షేమాన్ని కాంక్షి స్తూ నిర్వహిస్తున్న ఉత్సవాలు దిగ్విజయం చేసేందుకు కృషి చేద్దాం. శ్రీవారి దయ అందరిపై ఉండాలి. బ్రహ్మోత్సవాల్లో భాగస్వామిని కావడం నా అదృష్టం.

చురుకుగా 'గృహజ్యోతి' సర్వే

- ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకం అమలు కోసం విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రతినెలా 200 యూనిట్లలోపు విద్యుత్ విని యోగించే వారి వివరాలు సేకరించేందుకు ఇంటింటి సర్వే చేపట్టింది. సంబంధిత అధికారులు, సిబ్బంది విద్యుత్ విని యోగదారుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నిర్ధారణ చేసుకుంటున్నారు. విద్యుత్ వినియోగదారులు నుంచి ఈ నెల బిల్లు, ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ సేకరిస్తున్నారు. సర్వే ఈ నెల15తో ముగియనుంది.



సర్వే చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

- రూరల్‌లో 90 శాతం.. అర్బన్‌లో 60 శాతం పూర్తి

జిల్లాలో మొత్తం ఐదు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నారు. అందులో 3,44,257 గృహ అవసరాలకు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి పథకం అమలు చేసేందుకుగా ప్రభుత్వం జిల్లాల వారిగా నోడల్ అధికారిని నియమించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి వివరాలను కూడా నమోదు చేసుకునేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు రూరల్‌లో 90 శాతం, అర్బన్‌లో 60 శాతం వివరాల సేకరణ పూర్తయింది. మరో మూడు రోజుల్లో వంద శాతం కనెక్షన్ల వివరాలను నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- అద్దె ఇళ్లకూ..

పట్టణాల్లో చాలా మంది అద్దె ఇళ్లల్లో నివసిస్తుంటారు. ఇంటి యజమాని పేరిట విద్యుత్ కనెక్షన్ ఉంటుంది. దీంతో సర్వే చేస్తున్న సిబ్బంది అద్దె ఇంట్లో ఉండే వారి రేషన్, ఆధార్ కార్డుల వివరాలను ఆ కనెక్షన్‌కు జోడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సిబ్బంది వచ్చినప్పుడు ఇంటి వద్ద లేని వారు ప్రజాపాలన దరఖాస్తు రసీదు సంఖ్య, ఆధార్ నంబర్, రేషన్ కార్డ్ నంబర్, మొబైల్ ఫోన్ నంబర్‌ను సంబంధిత ఏఈ ఆఫీసు, ఏవో ఈఆర్వో ఆఫీసు, బిల్లుల సేకరణ కేంద్రంలో సిబ్బందికి అందజేయవచ్చు.

విద్యుత్ సిబ్బందికి వివరాలు అందించండి

- వడ్లకొండ గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్ఈ



గృహజ్యోతి పథకానికి సంబంధించి విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నాం. వినియోగదారులు సిబ్బందికి అందుబాటులో ఉండి వివరాలను తెలియజేయాలి. చాలా ప్రాంతాల్లో ప్రజలు అందుబాటులో ఉండకపోవడం ఇబ్బందిగా మారింది. జిల్లా యంత్రాంగం, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సహాయంతో డేటాను సేకరిస్తున్నాం.

కళల్లోనూ సైన్స్ ఉంది: డీఈవో

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: సాహిత్యం, కళలు ఏదైనా అది విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించాలని, కళల్లోనూ సైన్స్ దాగి ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సుస్థిర సమగ్రాభివృద్ధికి సైన్స్ అనే అంశంపై విద్యార్థులకు కవిత్వం, రచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల (దస్గర్‌వాడీ)లో జరిగిన కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో టీఎస్ కాస్ట్ రాష్ట్ర పరిశీలకుడు అనిల్ నతేశన్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, నోడల్ అధికారి కోట లక్ష్మారెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ మారం స్వదేశీకుమార్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, నాగేశ్వర్‌రావ పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు ఏసీపీల బదిలీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: పోలీస్ కమిషనరేట్‌లోని పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు వనపర్తికి బదిలీ చేశారు. ఇంటెలిజన్స్‌లో డీఎస్పీగా పని చేస్తున్న పి వెంకటరమణను కరీంనగర్ రూరల్ ఏసీపీగా నియమించారు. ఆదిలాబాద్ డీసీఆర్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్ జిని హుజురాబాద్ ఏసీపీగా బదిలీ చేశారు. హుజురాబాద్ ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కాజీపేట ఏసీపీ పి డేవిడ్ రాజును కరీంనగర్ పీటీసీకి, కరీంనగర్ పీటీసీ డీఎస్పీ జి మహేష్‌బాబును రామగుండం సీసీఎస్ ఏసీపీగా, కరీంనగర్ సీసీఎస్ ఏసీపీ వి మాధవిని రామగుండం సీసీఆర్బీ ఏసీపీగా బదిలీ చేశారు.

ఎవరిని ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించినా గెలిపించాలి

- బీఆర్ఎస్ అంటే బందిపోటు రాష్ట్ర సమితి
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 12: అధిష్ఠానం ఎవరిని ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించినా గెలుపునకు అందరూ కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని జిల్లా, మండల, బ్లాక్, పట్టణ, నగర అధ్యక్షులతో సమీక్ష సమావేశం డీసీసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, ఈ నెల చివరి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని, మహిళలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో తాను ఆశించిన స్థాయిలో మహిళా కాంగ్రెస్ పని చేయడం లేదనిపిస్తుందని, కార్యవర్గ సభ్యులు ఏవో సాకులు చెప్పి సమావేశాలకు గైర్హాజరయితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వారం రోజుల్లో జిల్లా, మండల, పట్టణ, నగర కమిటీలను త్వరగా నియమించి, పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసి ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణలో 17 పార్లమెంటు స్థానాల్లో కనీసం 15 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకునే విధంగా మహిళ కాంగ్రెస్ పని చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి పెద్దపీట వేస్తామని, పైరవీలు చెల్లవన్నారు. నోట్ల రద్దు చేసి నల్లధనం బయటకు తీసుకొస్తా అని చెప్పిన పీఎం నరేంద్ర మోదీ చివరికి పసిపిల్లలు తాగేపాలపై కూడా జీఎస్టీ విధించారని విమర్శించారు. బీసీలకు జరిగిన అన్యాయం విషయంలో ఎప్పుడు మాట్లాడని కల్వకుంట్ల కవిత ఇప్పుడు అసెంబ్లీ ప్రాంగణంలో జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందన్నారు. 10 సంవత్సరాల అధికారంలో బీఆర్ఎస్ పార్టీయే ఉందని, అప్పుడు ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. లిక్కర్ దందాలో ఆధారాలతో సహా పట్టుబడ్డ కవితను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేయలేదని, బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఇంత కడుపు మంట అని ప్రశ్నించారు. కొంతమంది ఆటో డ్రైవర్లకు డబ్బులు ఇచ్చి పార్టీపై వ్యతిరేకంగా మాట్లాడిస్తున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇన్ని రోజులు దోచుకున్న డబ్బులను రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బయటకు తీస్తారని, డబ్బులు తీసుకుని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఆమె కోరారు. ఈ రోజు నుంచే పార్లమెంటు స్థాయిలో మహిళా కాంగ్రెస్ నాయకులు డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్రసత్య ప్రసన్నరెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చర్ల పద్మ, రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, రాష్ట్ర కో ఆర్డినేటర్ పద్మ, నాయకురాళ్లు ముద్దం లక్ష్మి, చంద్రకళ, తాటిపర్తి విజయలక్ష్మి, సరళ, నీలం పద్మ పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు సహకారం అందిస్తాం

- కలెక్టర్ పమేలా సత్పతి
- వారధి సొసైటీ నుంచి 120 పరుపులు అందజేత

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12: మానసిక వికలాంగ విద్యార్థులకు అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందజేస్తామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని మహాత్మానగర్ ఎల్ఎండీ కాలనీలోని జిల్లా స్వతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాన సిక వికలాంగుల పాఠశాలను కలెక్టర్ సోమవారం సందర్శించారు. పాఠశాలను పరిశీలించి విద్యా ర్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యా లను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనిషిలో అవిటితనం ధైర్యానికి, విజయానికి ఆటంకం కాదని, ఆత్మస్థైర్యంతో ప్రపంచాన్ని జయించవచ్చన్నారు. ప్రత్యేక అవసరాలకు తగ్గట్టుగా అంకితభావంతో పని చేస్తున్న ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. వారధి సొసైటీ తరపున మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు ఆరు లక్షల విలువ గల 120 పరుపులను అందజేశారు. గ్రూప్స్ కోసం సిద్ధమవుతున్న ఇద్దరు యువతులకు 18 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు దాతలు కలెక్టర్ చేతుల మీదుగా పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందజేశారు.



మానసిక వికలాంగుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

నిధులు లేక నిర్వహణ భారంగా మారింది..

- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

30 సంవత్సరాలుగా సేవా దృక్పథంతో మానసిక వికలాంగుల పాఠశాలను నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నిధులు నిలిచిపోవడంతో పాఠశాల నిర్వహణ భారంగా మారిందని జిల్లా స్వాతంత్ర్య సమర యోధుల ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో పని భారం పెరిగిందని, సిబ్బంది చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నరన్నారు. ఖర్చులు పెరగడంతో ఎక్కువ మంది పిల్లలకు సేవ చేయలేకపోతున్నామన్నారు. దాతల సహకారంతోనే ప్రస్తుతం పాఠశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పాఠశాలను దత్తత తీసుకొని నిర్వహిస్తే బాగుంటుందన్నారు. లేకపోతే పాఠశాల నిర్వహణకు కావాలసిన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు మాజీ చైర్మన్, మాజీ ఎంపీ గొట్టె భూపతి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ కనకయ్య, వారధి సొసైటీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, పాఠశాల ట్రస్టీ సభ్యులు గాజుల భర్గవ్, రమణారెడ్డి, సముద్రాల జనార్దన్‌రావు, మధుసూదన్‌రావు, పాఠశాల ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్, ఫిజియోథెరపిస్ట్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కన్వీనర్ వసంత్‌కుమార్

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 : ఇంజనీరింగ్ విద్యార్థులు వారం రోజులు నిర్వహించే వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెకానికల్ విభాగాధిపతి, కన్వీనర్ డా.. కె. వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే ఫైనైట్ ఎలిమెంట్ అనాలసెస్ యూజింగ్ అన్సిస్ వర్క్ బెంచ్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని ఏదైనా రియల్ ప్రొడక్ట్‌ను తయారు చేయకుండానే దాని మోడల్‌ను ప్రిపేర్ చేసుకోవచ్చునన్నారు. చేసిన మోడల్ ఎంత వరకు పనిచేస్తుందో తెలుసుకోవచ్చునన్నారు. అసలు ప్రొడక్ట్ తయారు చేయకుండానే ఖర్చును తగ్గించుకొని ఖచ్చితాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ తెలుసుకోవటంతో ప్రొడక్ట్ ఎలా పనిచేస్తుంది, ఏ మెటీరియల్ వాడాలన్న విషయాలు తెలుస్తాయన్నారు. ఈ వర్క్‌షాప్‌కు సహకరించిన రిసోర్స్ పర్సన్ రాజ మహేంద్ర సిమ్యులేషన్ ఇంజనీర్ హైదరాబాదు, మెకానికల్ ఫ్యాకల్టీ కోకన్వీనర్ డా.. సురేష్ అర్జుల్లా, కోఆర్డినేటర్ బి. నర్సయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ డా.. టి.వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

బోయినపల్లి, ఫిబ్రవరి12: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం దేశాయిపల్లి సమీపాన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారి వివరాలు తెలియాల్సి ఉంది.

డీఈఈ సెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, ఫిబ్రవరి12: డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులై ఇప్పటి వరకు ఒరిజినల్ ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు మూడవ దశలో ప్రవేశాల కోసం ఈ నెల 14న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో తమ సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరం 2023-24లో చేరుటకు నిర్వహించిన డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో డైట్‌కు రావాలని కోరారు. మూడవ దశ ప్రవేశాలకు ఈ నెల 15 నుంచి 17 వరకు ఆప్షన్ పెట్టుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డీఈఈ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని రాజాపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన ఆర్ కల్పన అనే మహిళ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తుండగా, విధుల్లో భాగంగా జమ్మికుంటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. ఈ క్రమంలోనే రాజపల్లి గ్రామ శివారులోకి ద్విచక్ర వాహనం చేరుకోగానే, వాహనం అదుపు తప్పి పక్కనే బోర్డుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు మహిళలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాంకులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగి పలు ఫైళ్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా యూబీఐ స్టోర్‌రూంలో మంటలు అంటుకుని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజన్‌తో సహా ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామని ఆయన తెలిపారు.

శివంగాలపల్లిలో మూడు ఇళ్లలో చోరీ

కోనరావుపేట, ఫిబ్రవరి 12 : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ కోనరావుపేట మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత వారం రోజుల్లో నాలుగు గ్రామాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బొడ్డు దేవయ్య, జంగం లక్ష్మి, గూడూరు రేణుక వీరు ఇళ్లకు తాళం వేసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బొడ్డు దేవయ్య ఇంటిలో తాళం పగలగొట్టి 30 తులాల వెండి ,జంగం లక్ష్మి ఇంటిలో తాళం పగలగొట్టి 20 తులాల వెండి, గూడూరి రేణుక ఇంటి తాళం పగలగొట్టి మూడు వేల నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు దొంగతనం తీరును పరిశీలించి సీసీ కెమెరాల ఫుటేజ్ తీయగా ఇద్దరు వ్యక్తులు మంకీ క్యాప్ ధరించి దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు.

కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు రోజులుగా కుక్కలు దాడులకు ప్పాలడుతున్నాయి. సోమవారం వరకు ఆరుగురు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు బయటికి రావడానికి భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 114మంది రైతులు 1,134క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

వీణవంక ఫిబ్రవరి 12: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన ముష్క సదయ్య (45)ఆర్థిక ఇబ్బందులతో తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తూ మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నందిమేడారంలో సైబర్ మోసం

ధర్మారం,ఫిబ్రవరి12: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ. 10వేలు అతనికి తెలియకుండా వేలిముద్రతో సైబర్ నేరగాళ్లు డ్రా చేశారు. ఈ మేరకు సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఆదివారం సాయంత్రం ఏఈపీఎస్ ద్వారా పది వేల రూపాయల నగదును విత్‌డ్రా చేశారు. డ్రా చేసినట్టు తన సెల్ నంబరుకు మెసేజ్ వచ్చింది. ఆందోళనకు గురైన పవన్‌కుమార్ వెంటనే 1930 ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9న ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ కోసం తన వేలిముద్రలను ఉపయోగించాడు. అక్కడి నుంచి ఎవరో తన వేలిముద్రలను ఉపయోగించి మోసం చేశారని ఆయన అనుమానంతో సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆధార్ కార్డులను బయోమెట్రిక్ లాక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, ఫిబ్రవరి 12: మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి సాగర్(28)సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జూలపల్లి ఎస్సై ఎస్.శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత కొన్ని రోజులుగా కుటుంబంలో కలతలు వచ్చాయని దీంతో జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందాడని తెలిపారు. సాగర్‌కు భార్య కల్యాణి, కూతురు 18నెలల పాప ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సాగర్ నేత్రాలను లయన్స్ క్లబ్‌వారు సేకరించారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి ఎంపిక


జ్యోత్స్న

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో నిర్వహించే శిక్షణ శిబిరానికి గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్, శిక్షకురాలు జ్యోత్స్న ఎంపికయ్యారు. 9వ బెటాలియన్ తరుపున జ్యోత్స్న పాల్గొంటున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

సిరిసిల్ల క్రైం , ఫిబ్రవరి 11 సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేశం ఇంట్లో సెల్ ఫోన్, రూ. 500 నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. పెయింటింగ్ చేస్తూన్నా శ్రీకాంత్, సంతోష్‌లు చోరీకి పాల్పడినట్లు అయన తెలిపారు.

మల్లికార్జున్‌రెడ్డికి మిలియనీర్ ఫార్మర్ అవార్డు

చొప్పదండి, ఫిబ్రవరి 12: చొప్పదండి మండలంలోని పెద్దకుర్మపల్లికి చెందిన ఉత్తమ రైతు మవురం మల్లికార్జునరెడ్డి డిస్ట్రిక్ట్ మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నారు. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కెవికెలో జరిగిన రైతు సదస్సులో మల్లికార్జున్‌రెడ్డి అవార్డును ఐసిఎఆర్ డిడిజి డాక్టర్ ఉత్తంసింగ్ గౌతం ఏటిఎఆర్ఐ డైరెక్టర్‌లు అందజేశారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన జమ్మికుంట కెవికె డైరెక్టర్ వెంకటేశ్వరరావుకు ఈ సందర్భంగా మల్లిఖార్జునరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ పరిసరాలు


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 12 : దక్షిణ కాశీ, ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు అశేష భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో వేములవాడ పుణ్యక్షేత్రంలో గత కొద్ది రోజులుగా జాతరను పోలిన వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో సోమవారం నాడు సుమారు 60 వేలకు పైగా భక్తులు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము నుండి నిరంతరాయంగా కొనసాగిన స్వామివారి దర్శనం సోమవారం రాత్రి వరకు సాగింది. ఫలితంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 90 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. ఈ సందర్భంగా వారు ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కోడె మొక్కు చెల్లింపు సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణం తో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటల కొద్దీ నిరీక్షించి తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారి కి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రైల్వే లైన్ బాధితులకు పరిహారం చెల్లించాలి

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రైల్వే లేన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులు సోమవారం సాయంత్రం ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్‌ను కలిశారు. స్థానిక తెలంగాణ చౌక్ వద్దకు చేరుకున్న బండి సంజయ్‌ను కలిసిన బాధితులు తమకు తగిన పరిహారం చెల్లించాలని, లేదంటే తమ భూములను గెజిట్ నుంచైనా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేను ఈ అంశంపై పలుమార్లు కలిసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై స్పందించిన బండి సంజయ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టిన వ్యక్తుల రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడుతున్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన దొంతరవేణి విజయ్, కుర్ర భాస్కర్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గల చెక్ డ్యాంలో తాము చేపలు పెంచుతున్న క్రమంలో పదిర వాసులు విజయ్, భాస్కర్‌లు కరెంటు షాక్‌తో చేపలను వేటాడుతున్నారని ఎలవేణి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎవరైనా విద్యుత్తు తీగలను అమర్చి జంతువులు, చేపలు వేటాడడంతో పాటు పంట పొలాల చుట్టు కరెంటు తీగలను ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15న జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 12: టీఎస్ఎన్‌పీడీసీఎల్ జిల్లా సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. కాల్‌లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో వాటిని పొందవచ్చన్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోలు ఎక్కించే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 12: మండలంలోని నమిలికొండ గ్రామంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని మదన్(37)శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అర్జరాజు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మదన్ రెండు సంవత్సరాల నుంచి అత్తగారి ఊరు మండలంలోని నమిలికొండ గ్రామంలో నివసిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దాగుడు మూతలు

● లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసీఆర్ ప్రభుత్వం ● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడ, ఫిబ్రవరి 12 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ దాగుడుమూతలు ఆడుతున్నాయని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన వేములవాడ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కెసిఆర్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని కేసీఆర్ ఆస్తులను జప్తు చేసి కాళేశ్వరం సంబంధించిన సొమ్మును రికవరీ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని ఆయన సవాల్ విసిరారు. రాజీవ్ రహదారిపై సభా సంఘం మాదిరిగా డ్రామాలొద్దని, మేడిగడ్డ ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థను బెదిరించి స్వయం ప్రకటిత మేధావిగా చెప్పుకునే ఓ నాయకుడు తన కుటుంబ సభ్యులకు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నారని, క్వాలిటీ లేకుండా పనులు చేసి పిల్లర్లు వంగిపోయి ప్రమాదానికి కారకుడు ఆ స్వయం ప్రకటిత మేధావే అని అన్నారు. సదరు స్వయం ప్రకటిత మేధావిపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపంతో పనులు చేసి ప్రజల సొమ్ములు స్వాహా చేసిన వారిపై కేసులు పెట్టి సొమ్మును రికవరీ చేసి నిజాయతీని నిరూపించుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రెండు పార్టీలు కలిసి అసెంబ్లీని టైంపాస్ వ్యవహారంగా మారుస్తున్నారని అన్నారు.


వేములవాడలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఆటో నడిపిన బండి సంజయ్

ప్రజాహిత యాత్రలో భాగంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం సాయంత్రం వేములవాడలో ఆటో నడిపించారు. యాత్ర సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు బండి సంజయ్‌ను కలిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కారణంగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని మొరపెట్టుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని బండి సంజయ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకుడు చెన్నమనేని వికాస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో పోలీసు కస్టడీకి శ్రీపతిరావు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: భూకబ్జా కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తోట శ్రీపతిరావును కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని వివేకానందపురి కాలనీలో అనుమాండ్ల రవీందర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం 8 పిల్లర్లను కూల్చివేసిన ఘటనకు సంబంధించిన కేసులో ఈ నెల 6న తోట శ్రీపతిరావును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి తోట శ్రీపతిరావును మరింత లోతుగా విచారించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కస్టడీకి కోర్టు అనుమతించింది. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కస్టడీకి అనుమతించినట్లు సమాచారం. శ్రీపతిరావును కస్టడీకి తీసుకుని పోలీసులు అతడి ఇంటికి వెళ్లి సోదాలు జరిపి పలు కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.


శ్రీపతిరావును అతని ఇంటిలో సోదాలకు తీసుకువెళ్తున్న పోలీసులు

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దర్శించుకున్నారు. సోమవారం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికి పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం గావించారు. ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ శ్రీరాములు వెంట ఉన్నారు.

యువకుడి హత్య


శ్రీధర్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీధర్ కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శ్రీధర్ రాజన్న ఆలయ ధర్మగుండం వద్ద జంగమ పూజారిగా జీవనోపాధి పొందుతున్నాడు. అదే కాలనీకి చెందిన అతడి స్నేహితుడు బాబు ఆదివారం రాత్రి శ్రీధర్ ఇంటికి వచ్చి పార్టీ ఉందని తీసుకెళ్లాడు. శ్రీధర్ ద్విచక్ర వాహనంపై జర్మనీ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఖాళీ ప్రాంతానికి వెళ్లారు. ఇంట్లో నుంచి వెళ్లిన శ్రీధర్ తిరిగి రాకపోవడంతో అతడి భార్య యామిని ఫోన్ చేసింది. తీయక పోవడంతో భయాందోళనకు గురైంది. తెల్లవారుజామున శ్రీధర్ హత్యకుగురయ్యాడని తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య యామిని, కుమారుడు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ

శ్రీధర్ హత్యకు గురైన సంఘటన వేములవాడ పట్టణంలో సంచలనంగా మారడంతో ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుడి కుటుంబ సభ్యుల రోధించడంతో విషాదఛాయలు అములుకున్నాయి.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ఛాంపియన్‌షిప్


ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రస్థాయి 56వ సీనియర్ ఖోఖో పోటీల పురుషుల ఛాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. నల్గొండ జిల్లా భువనగిరిలో ఈనెల 8 నుంచి 11వరకు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్, జట్లపై గెలుపొంది సెమి ఫైనల్స్‌లో వరంగల్ జిల్లా జట్టుతో తలపడి 5 పాయింట్ల తేడాతో ఫైనల్స్‌లో ప్రవేశించిందని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి పోరాపోరిగా సాగిన పురుషుల ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టు రంగారెడ్డి జట్టుతో తలపడి ఒక్కపాయింట్ తేడాతో గెలుపొందిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచిన జట్టును డీవైఎస్‌ఓ కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఖోఖో సంఘం ప్రతినిధులు చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, ఈ నరేష్, ఎ రవీందర్, వంగపల్లి సూర్యప్రకాశ్, ఖో ఖో కోచ్‌లు వెంకటేష్, సభ్యులు ఎస్ కె మోయినోద్దిన్, మంగ సంతోష్, బి శేఖర్, కట్ట సంతోష్, రాదారాణి, రేణుక, కవిత, మానస, ఆర్ఐ కుమార్, ఎస్ఎ రమేశ్, పండుగ ఆనంద్, ప్రసాద్, శ్రీలత, జ్యోతి, జలందర్, లక్ష్మన్, నవీన్ తదితరులు అభినందించారు.

ఎక్సైజ్ శాఖలో సీఐలు, ఎస్ఐల బదిలీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎక్సైజ్ శాఖలో భారీ సంఖ్యలో సీఐలు, ఎస్ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ పి.తాతాజీని పరకాలకు బదిలీ చేశారు. హుజూరాబాద్ సీఐ దుర్గా భవానిని హన్మకొండకు, జగి త్యాల సీఐ ఎస్.ప్రభాకర్ రెడ్డిని వరంగల్ అర్బన్‌కు, సుల్తానాబాద్ సీఐ సీహెచ్ శామ్యూల్ ఆనంద్ రావును వరంగల్ అర్బన్ డీటీఎఫ్ సీఐగా, కరీంనగర్ రూరల్ సీఐ ఎం తిరుమలతను హన్మకొండ ఐఎంఎల్‌డిపో-1కు, రామగుండం సీఐ ఎస్ రమేష్‌ను ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, సత్తుపల్లి సీఐ వి రాజశేఖర్‌రావును వేములవాడకు బదిలీ చేశారు. వేములవాడ సీఐ జి.రామును కరీంనగర్ అర్బన్‌కు, జగిత్యాల సీఐ ఎస్ అశోక్‌కుమార్‌ను కరీంనగర్ రూరల్‌కు, లక్సెట్టిపేట సీఐ ఎస్ బాబాను తిమ్మాపూ ర్‌కు, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సీఐలుగా పనిచేస్తున్న టి శ్రీనివాసులును హుజురాబాద్‌కు, ఎం మాధవిలతను జమ్మికుంటకు, ఆసిఫాబాద్ సీఐ సయ్యద్ మోసిన్‌అలీని కరీంనగర్ ఎన్‌ఫోర్స్ మెంట్‌కు, నేలకొండపల్లి సీఐ కె పోశెట్టిని పెద్దపల్లికి, పాల్వంచ సీఐ గురునాథ్‌ను సుల్తానాబాద్‌కు, కాగజ్‌నగర్ సీఐ సీహెచ్ మంగమ్మను రామగుండంకు బదిలీ చేశారు. ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మంథనికి, హరితబయో డిస్టిల్లరీ సీఐ ప్రియాంకను పెద్దపల్లికి, ఖమ్మం ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వై సర్వేశ్వర్‌రావును జగిత్యాలకు, ఊట్నూర్ సీఐ టి మహేందర్ సింగ్‌ను ధర్మపురికి, పెద్దపల్లి డీటీఎఫ్ సీఐ వినోద్ రాథోడ్‌ను మెట్‌పల్లికి, ఇచ్చోడ సీఐ సీహెచ్ రాజమౌళిని జగిత్యాల డీటీఎఫ్‌కు, పెద్దపల్లి సీఐ ఎం శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేటకు, ధర్మపురి సీఐ ఏ ముత్యంను ఆదిలాబాద్ డీటీ ఎఫ్‌కు, జమ్మికుంట సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్‌ను ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. మంథని సీఐ జి గురువయ్యను మంచిర్యాలకు, తిమ్మాపూర్ సీఐ జె ఇంద్రప్ర సాద్‌ను బెల్లంపల్లికి, ఎల్లారెడ్డిపేట సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్ ఎస్‌టీఎఫ్‌కు, మెట్‌పల్లి సీఐ ఎం రాధను తూర్పాన్ డిస్టిల్లరికి, కరీంనగర్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ కె విజయ్ కుమార్‌ను ప్రియాంక డిస్టిల్లరీస్‌కు, జమ్మికుంట ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రమాదేవి వరంగల్ అర్బన్ డీటీఎఫ్ ఎస్ఐగా బదిలీ చేశారు. సిరిసిల్ల ఎస్ఐ కె.విజేందర్ కొత్తగూడెంకు, లక్సెట్టిపేట ఎస్ఐ ఏఆర్‌సీ జాన్ రాబర్ట్‌ను కరీంనగర్ అర్బన్, చెన్నూర్‌లో పనిచేస్తున్న కే లక్ష్మణ్‌ను కరీంనగర్ రూరల్‌కు, ఖాజీపేటలో పనిచే స్తున్న ఎం.సౌమ్యను జమ్మికుంటకు, మెట్‌పల్లి ఎస్ఐ ఎంఏ మజీద్‌ను కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, కరీంనగర్ రూరల్ ఎస్ఐ కె.స్వప్నను జగిత్యాలకు, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ కె.నరేష్‌ను ధర్మపురికి, ఇచోడ ఎస్ఐ సీహెచ్ లక్ష్మన్‌కుమార్‌ను మెట్‌పల్లికి, ధర్మపురి ఎస్ఐ కె.శ్రీనివాస్‌ను వేములవాడకు, పెద్దపల్లి ఎస్ఐ మనీషా రాథోడ్‌ను మంచిర్యాలకు, రామగుండం ఎస్ఐ జి.శారదను బెల్లంపల్లికి, పెద్దపల్లి ఎస్ఐ బి.ప్రభాకర్‌ను బౌసీపీ సాలూరకు, జగిత్యాల ఎస్ఐ ఎన్.సరితను మిర్‌దొడ్డికి, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ ఆర్.రూపను హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి


పల్లె రమణ(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 12: కన్న కొడుకుకు ఉద్యోగం రాలేదని ఓ తల్లి పురుగుల మందు తాగి చికిత్స పొందుగూ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెర్లమద్ది గ్రామానికిచెందిన పల్లె రమణ (40) అనే మహిళ తన కొడుకుకు ఉద్యోగం రావట్లేదని మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎల్లారెడ్డిపేటకు తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. రమణకు భర్త రవీందర్, కొడుకులు ఉన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 12: నగరంలోని మార్కెట్‌రోడ్ ప్రాచీన వేంకటేశ్వరస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్క రించారు. ఉత్సవాలను శాస్త్రోక్తంగా, ఘనంగా నిర్వహించాలని మంత్రి అన్నారు. శ్రీవారి దయ ఉమ్మడి జిల్లా ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ వుడుతల వెంకన్న, వైద్యుల అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భారతదేశ సంస్కృతిని కాపాడుకోవాలి'

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 12: ప్రతి ఒక్కరూ భారతదేశ సంస్కృతిని కాపాడుకోవాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు అన్నారు. ఫిబ్రవరి 14కు సంబంధించిన గోడ పత్రికలను విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2019వ సంవత్సరం ఫిబ్రవరి 14న పాకిస్తాన్ జరిపిన ఉగ్ర దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందారన్నారు. దేశయువత వాలెంటైన్స్ డేను బహిష్కరించి, పుల్వామా అమరవీరులకు నివాళులు అర్పించాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, జిల్లా సహ కార్యదర్శి శ్రీనివాససుదర్శన్, జిల్లా సహకారదర్శి తోట రాజేందర్, బజరంగ్‌దళ్ జిల్లాకో కన్వీనర్ కన్నం శంకర్, బజరంగ్‌దళ్ నగర కన్వీనర్ గుజేంటి రాజేందర్, రూరల్ మండల కో కన్వీనర్ గీతం, సాయితేజు, వంశీ, పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల్లో ఆర్టీసీ ఉద్యోగికి పతకం

భగత్‌నగర్, ఫిబ్రవరి 12: గోవాలో ఈనెల జరిగిన జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో కరీంనగర్ ఆర్టీసీ ఉద్యోగి కూన కిషన్ బ్రాన్స్ మెడల్ సాధించారు. కిషన్ మెడల్ సాధించడంపట్ల ఆర్టీసీ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేటర్ల ఆస్తులపై విచారణ చేపట్టాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి12: అవినీతి అక్రమాలకు పాల్పడిన కార్పొరేటర్ల ఆస్తులపై విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో భూకబ్జాలు అవినీతి, అక్రమా లకు పాల్పడిన కార్పొరేటర్ల ఆస్తులపై సీబీడీతో విచారణ జరిపించాలన్నారు.

ప్రైవేట్ స్థలంలో పంచాయతీ భవనం

-విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



బొమ్మకల్‌లో ప్రైవేటు స్థలంలో నిర్మించిన పంచాయతీ మూడంతస్తుల భవనం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 12: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో ప్రైవేట్ స్థలంలో పంచాయతీ భవనాన్ని నిర్మించి బిల్లులు తీసుకున్నారు. బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 17/ఎ డాక్యుమెంట్ నం.12384/2021 ప్లాట్‌నంబర్1 అవంచ ఆర్తీకరెడ్డి భర్త రంగారెడ్డిది. ఈ స్థలంలో గ్రామపంచాయతీ భవనాన్ని మూడు అంతస్తులతో నిర్మించారని ఇందుకు ఎనిమిది లక్షల వరకు బిల్లులు తీసుకున్నారని మాజీ వార్డు సభ్యుడు టి.కిరణ్‌కుమార్ ప్రజావాణిలో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో మూడంతస్తుల భవనం నిర్మించారని, జనవరి 26న అప్పటి సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ అధికారికంగా ప్రారంభించారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎనిమిది లక్షల రూపాయల బిల్లు తీసుకున్నారన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

గృహలక్ష్మి దరఖాస్తుల కంప్యూటీకరణ

హుజూరాబాద్, ఫిబ్రవరి12: హుజూరాబాద్ డివిజన్‌లో గృహలక్ష్మి పథకం కింద వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణ జరుగుతున్నట్లు హుజూరాబాద్ ట్రాన్స్‌కో డీఈ లక్ష్మారెడ్డి సోమవారం తెలిపారు. హుజూరాబాద్ డివిజన్‌లోని గ్రామాల్లో 77వేల మీటర్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. వీటిలో ఇటీవల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ప్రజల దరఖాస్తులను ట్రాన్స్‌కో సిబ్బంది కంప్యూటరీకరణ చేస్తున్నారన్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో పనిచేసే లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఇల్లందకుంట, ఫిబ్రవరి 12: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం 48 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కనీస వేతన చట్టాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, పని గంటలు లేకుండా కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, మాట్లాడే హక్కులను నిర్వీర్యం చేస్తూ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికవర్గంతో పాటు గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కొత్తూరు మల్లయ్య, నాయకులు రవీందర్‌రావు, బాబు, రాజేందర్, అంజయ్య, సంపత్, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఏకశిల విద్యార్థి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామ శివారులోని ఏకశిల పాఠశాలలో చదువుతున్న వలబోజు విశ్వనాథన్ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైయిర్ ఎగ్జిబిషన్‌లో 'ఇన్నోవేటివ్ వెట్ ప్రొటెక్టర్, ఆటోమెటిక్ సీడ్‌డ్రయర్' అనే అంశంపై అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయిర్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దినేష్ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థిని, గైడ్ టీచర్ కుమారస్వామిలను పాఠశాల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



చెక్కు అందజేస్తున్న పల్లె ప్రభాకర్‌గౌడ్

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 12: విద్యార్థులు చదువులో రాణించినప్పుడే ఉన్నత స్థాయిలో నిలబడతారని పీఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్‌గౌడ్ అన్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చదువు దృష్టిలో పెట్టుకుని రెండు నెలల క్రితం తన సొంత ఖర్చులతో ప్రభాకర్‌గౌడ్ విద్యా వలంటీర్‌గా బండారి రమ్యను నియమించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పూర్తి అయ్యేంత వరకు విద్యా వలంటీర్‌కు తన సొంత డబ్బుల్లో నుంచి వేతనం ఇస్తానని ప్రకటించారు. మొదటి నెల వేతనం చెక్కు రూపంలో అందరి సమక్షంలో అందజేశారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధిస్తే రూ.5వేలు, రెండవ ర్యాంకు రూ.2500 చొప్పున చెల్లిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పల్లె రవిగౌడ్, గండి రంజీత్‌కుమార్, గిరవేణ రాజయ్య, డాక్టర్ గోపి, పల్లె సంపత్, తాటిగంటి వీరస్వామి, ఉపాధ్యాయులు చైతన్య, దేవదాస్, ప్రకాష్, శ్రీనివాస్, నరహరి, ప్రేమలత, శ్రీధర్, శ్రీమన్నారాయణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర కేటాయింపులు'



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: బడ్జెట్‌లో విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ విమర్శించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.75శాతం(21,389) నిధులు కేటాయించిందన్నారు. విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయించాలని పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా సరిపడా నిధులు కేటాయిస్తుందని ఆశపడ్డ విదార్థి లోకానికి నిరాశ ఎదురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 ప్రభుత్వ యూనివర్సిటీలకు కేవలం రూ.500కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే యూనివర్సిటీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలు లేక, బోధన, బోధనేతర సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాత వాహన యూనివర్సిటీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నా అధికారులు స్పందించడం లేదని మల్యాల రాకేశ్ అన్నారు. ప్రతి యూనివర్సిటీకి రూ.300 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, లా ఫోరం కో కన్వీనర్ నక్క ప్రమోద్, నగర కార్యదర్శి బామండ్ల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగపెల్లి నితీష్‌రెడ్డి, చింతలతడె మధు, నగర ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, ఎస్ఎఫ్ఎష్ కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

రేపు మాక్ పోలింగ్

-అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ తనిఖీ చేసి 14న మాక్ పోలింగ్ నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ అన్నారు. సోమవారం ఈవీఎంలను భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ మొదటి దశ తనిఖీ ప్రక్రియను పరిశీలించామన్నారు. 14న రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఇంజనీర్ల బృందంతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

'నిబంధనలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే, పరీక్షలు జరగనున్న తరుణంలో పండగల పేరుతో, తక్కువ ఫీజు ఉంటుందని ప్రచారం చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. మూత్రశాలలు, లైబ్రరి, ల్యాబ్, గ్రౌండ్ వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకున్నా కార్పొరేట్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నవీన్, సిద్ధు, నరేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 12: నగరంలోని పద్మశాలి సంఘ భవనంలో సోమవారం సంఘ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో భక్త మార్కండేయ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. గంగుల దిలీప్ ముద్రించిన పద్మశాలి వంశ వృక్షం, గోత్ర నామాలతో కూడిన ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి ట్రస్ట్ ఉపాధ్యక్షుడు మోర రాజేశం, యువజన పద్మశాలి అధ్యక్షుడు జి శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి వి ఆంజేయులు, కోశాధికారి కనకయ్య, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, అశోక్, సుభాష్, గణేశ్, కరుణాకర్, రామకృష్ణ, శ్రీహరి, శారద, మధుసూదన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆది నారాయణ మృతి తీరనిలోటు'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ముంద్ర ఆది నారాయణ మృతి వైజ్ఞానిక సమాజానికి తీరనిలోటని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రామరాజు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జేవీవీ ఆధ్వర్యంలో ఆది నారాయణకు ఘనంగా నివాళులర్పించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి సంపతి రమేశ్ మాట్లాడుతూ తుదిశ్వాస వరకు జేవీవీ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. అంతిమ శ్వాస వరకు శాస్త్రీయ ప్రచార ఉద్యమానికి తన సమయాన్ని ఇచ్చి మనందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొడిముంజ శంకర్, జిల్లా బాధ్యులు వంతడపుల ఆంజనేయులు, ఎన్.దేవేందర్, స్వామి పాల్గొన్నారు.

'ఓటరు జాబితాను సవరించాలి'

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 12: కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో ఓటరు లిస్టును సవరించాలని గ్రామస్థులు కోరారు. దుర్శేడ్ గ్రామంలోని 103 బూత్‌లో ఐదు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు 60 మంది చనిపోయినా వారి పేర్లు ఓటరు లిస్టులో వస్తున్నాయన్నారు. బీఎల్‌వోలు డిలీట్ చేసినా మళ్లీ అలాగే వస్తున్నాయన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు అడిగామని డిలీట్ కావడం లేదన్నారు. ప్రస్తుతం ఎంపీ ఎన్నికల కోసం వచ్చిన లిస్టుల్లో సైతం అవే పేర్లు ఉన్నాయన్నారు. దుర్శేడ్ గ్రామంలో నాలుగు బూత్‌లు ఉన్నాయని ప్రతి దానిలో చనిపోయిన వాళ్లే కాకుండా కొంత మంది పేర్లు రెండు సార్లు వచ్చాయన్నారు. గ్రామం నుంచి బదిలీ అయిన వారి పేర్లు కూడా తొలగించ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఓటరు లిస్టులు సవరించాలని కోరారు.

'వడ్డెర కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'



మాట్లాడుతున్న ఒడ్డెర సంఘం నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: వడ్డెర కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర యువజన చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు దండు తిరుపతి కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వాలు తమను పట్టించు కోలేదని ఆరోపించారు. ఎస్టీల స్థితిగతులపై ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలన్నారు. వడ్డెరల కులవృత్తులైన బండక్వారీ, ఇసుక క్వారీలపై హక్కులు కల్పించాలన్నారు. కుల వృత్తి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మరణిస్తే, వారి కుటుంబానికి ప్రభుత్వం రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. వడ్డెరలను కమ్యూనిటీ హాల్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



బెస్ట్‌టీం కప్‌ను అందుకుంటున్న సీఎస్‌కేఐ చీఫ్ శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: విశాఖపట్టణంలోని పోర్టుఇండోర్ స్టేడియంలో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన జాతీయ షోటోకాన్ ఓపెన్ కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన సీఎస్‌కేఐ క్రీడాకారులు పాల్గొని పతకాలతో పాటు బెస్ట్ టీం కప్‌ను అందుకున్నారు. సీఎస్‌కేఐ జాతీయ అకాడమి 8మంది క్రీడాకారులు పాల్గొని 16 పతకాలతో పాటు బెస్ట్ టీం కప్‌ను అందుకున్నారని సీఎస్‌కేఐ ఇండియా చీఫ్ శ్రీనివాస్ తెలి పారు. కట, కుమిటి విభాగాలలో కె పావని, పి శ్రీనిధి, జి అనన్య, వై విశ్వక్‌సేన్, వి శ్రేయాస్, ఎం వాగ్మయి, పి శ్రేయాన్స్, ఎం శ్రేయామ్సి పాల్గొని 8బంగారు పతకాలతో పాటు 4 కాంస్య పతకాలు, రెండు రజిత పతకాలను సాధించారని తెలిపారు. దేశం లోని 14 రాష్ట్రాల నుంచి వేయి మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. పతకాలు గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులు సీఎస్‌కేఐ చైర్మెన్ చల్ల హరిశంకర్, కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, ఉపాధ్యక్షుడు పెద్ది సందీప్, కాయ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అభినందించారు.

వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 12: హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి సోమవారం ధర్నా నిర్వహించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్‌పర్సన్ గందె రాధికలు కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడారు. జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘాల నాయకులు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం జీతాలు అందించాలన్నారు. రెండు రోజుల్లో జీతాలు ఇవ్వకుంటే మళ్లీ ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీ అర్జున్, సరోజ, సమ్మక్క, క్రాంతికుమార్, రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

చెంజర్లలో లైబ్రరీ ప్రారంభం

మానకొండూర్, ఫిబ్రవరి 12: మండలంలోని చెంజర్ల గ్రామంలో యాదవ సంఘం భవనంలో సోమవారం విద్యార్థి లైబ్రరీ ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని నక్క వెంకటమ్మ, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా విద్యాభివృద్ధికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెంజర్ల గ్రామంలోని యాదవ సంఘం భవనంలో పోటీ పరీక్షలకు చెందిన సుమారు లక్ష రూపాయల పుస్తకాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ గడ్డి రేణుక, నక్క ఉమేశ్‌యాదవ్, గడ్డి గణేష్, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయఫోరం అధ్యక్ష కార్యదర్శులు తిరుపతి, పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు సందబోయిన ప్రసాద్‌యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహాయాగం

వీణవంక ఫిబ్రవరి 12: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో పవిత్రోత్సవ సహిత పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కుండాత్మిక మహాయాగం నిర్వహించారు. నమిలి కొండ రమణాచార్యులు వేద పండితుల ఆధ్వర్యంలో సుమారు 246 జంటలతో యాగం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాచేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయస్వామి జయంతి



మార్కండేయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 12: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పద్మశాలి, చేనేత ఐక్య వేదిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయస్వామి జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏ శ్రీనివాస్, కె భాస్కర్, కె సాయి, రాణి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ, ఇ చంద్రశేఖర్, పి సంపత్, బి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామంలోని శ్రీ శివభక్త మార్కండేయ దేవాలయంలో భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతిని పురస్కరించుకొని సాయంత్రం భక్తులు రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్, రవీందర్, బిక్షపతి, వెంకటస్వామి, ప్రదీప్, శ్రీనివాస్, గుడి పూజారి శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో సోమవారం మార్కండేయ జయంతిని పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూర శ్రీనివాస్, ఒడ్నాల బలరాం, కమలాకర్, వెంకటేశం, రాములు, రవి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు రెండో విడత కోసం సీఎంవోకు వినతులు



వినతులను పోస్టులో సీఎంవోకు పంపిస్తున్న నాయకులు

జమ్మికుంట, ఫిబ్రవరి 12: దళితబంధు రెండో విడత వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దళితబంధు సాధన కమిటీ నాయకులు లబ్ధిదారుల నుంచి సేకరించిన వినతులను పోస్టులో సోమవారం సీఎంవోకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ విడుత దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సాధన కమిటీ నిర్వాహకులు కొలుగూరి సురేష్, మంద రాజేష్, కొలుగూరి నరేష్, రామంచ రాకేష్, నాగరాజు, సతీష్, రక్షిత్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్యుడి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ఆసుపత్రిలో రోగిని ఎలుక కరిచిన సంఘటనకు బాధ్యుడిని చేస్తూ డాక్టర్‌ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కరీంనగర్ ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, కార్యదర్శి జి వెంకటరెడ్డి, డాక్టర్ అలీం, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ లక్ష్మన్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ సురేష్, డాక్టర్ రమేశ్ అన్నారు. ఆసుపత్రిలోని ఐసీయూలో రోగిని ఎలుక కరిచిన సంఘటన బాధాకరమని, రోగికి సానుభూతి తెలియ చేశారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతాయన్నారు. వారిని వదిలేసి సంబంధంలేని డాక్టర్‌ను సస్పెండ్ చేయడం ఏమటని ప్రశ్నించారు. వెంటనే ఆయన సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రేపు 'జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి12: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు కోర్ కమిటీ కన్వీనర్‌గా, గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, అన్నవరం దేవేందర్, కెఎస్ అనంతాచార్య సభ్యులుగా పలువురు కవులు, రచయితల సృజనలచే రూపొందించిన 'కరీంనగర్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకాన్ని బుధవారం సాయంత్రం 5 గంటలకు ఫిలింభవన్‌లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలాసత్పతి పాల్గొంటారని పేర్కొన్నారు.

విరాళాల సేకరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 12: నగరంలోని 33వ డివిజన్ పరిధిలో గల సప్తగిరి కాలని కోదండ రామాలయ మండప పునర్నిర్మాణం కోసం వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో మేయర్ సతీమణి యాదగిరి అపర్ణాసునీల్‌రావు పాల్గొన్నారు.

ఆలయాల్లో టెండర్లకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి12: నగరంలోని సివిల్ హాస్పిటల్ సమీపంలో గల ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్ముకునే హక్కు కోసం దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ ద్వారా టెండరు ఆహ్వానం కోసం ఉత్తర్వులు పొందినట్లు ఈఓ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు టెండరు ఆలయంలో ఏర్పాటు చేసే బాక్స్‌లో వేయాలని, 11-30 గంటలకు వేలము నిర్వహిస్తామని పేర్కొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత దేవాలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్కు కోసం టెండరు ఆహ్వానిస్తు న్నట్లు ఈవో నాగుల అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ఉదయం 11 గంటలకు ఆలయంలో టెండరు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వడ్డెర సంఘం ఎన్నిక

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: తెలంగాణ వడ్డెర యువజన చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు దండు తిరుపతి సోమవారం పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆలకుంట శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ అధ్యక్షునిగా దారం నర్సయ్య, అర్బన్ అధ్యక్షునిగా ఓర్సు బుచ్చ పతి, టైన్ ప్రెసిడెంట్ వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'విద్యారంగానికి నిధులు కేటాయించాలి'

భగత్‌నగర్, ఫిబ్రవరి 12: రాష్ట్ర బడ్జెట్‌ను అనసరించి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శని గరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం పూజ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అభిలాష్, హరీష్, సహాయ కార్యదర్శి అసంపెల్లి వినయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

చొప్పదండి, ఫిబ్రవరి 12: చొప్పదండి మండలంలోని రేవెల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం లక్షెట్టిపేటకు చెందిన ఆవునూరి శివ విద్యార్థులకు క్రీడాదుస్తులు, ఐడీకార్డ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేణు కుమార్, ముఖ్యఅతిథిగా హాజరు కాగా, హెచ్ఎం సిరిపురం ఆనందం, లింగమ్మ, యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, కొమురయ్య, అంజయ్య, బాబు, లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

గంగాధర, ఫిబ్రవరి 12: గంగాధర మండలం ఇస్లాంపూర్‌కు చెందిన ఉద్యోగిని నేరెళ్ల మానసను మాజీ సర్పంచ్ వద్లూరి వనితాదిమల్లు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. గ్రామానికి చెందిన నేరెళ్ల మానస వైద్యశాఖలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం సాధించగా కరీంనగర్ మాతా శిశు కేంద్రంలో విధులు కేటాయించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత మానసను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సేవ చేయాలని సర్పంచ్ వనిత సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మానిటరింగ్ బృందం

మానకొండూర్, ఫిబ్రవరి 12 : మండలంలోని చెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఇంటర్నల్ మార్కుల మానిటరింగ్ బృందం సందర్శించింది. బృందం సభ్యులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయరాజ్ ఉన్నారు.

జెండా ఏర్పాటుకు పనులు

రామడుగు, ఫిబ్రవరి 12: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో అతిపెద్ద జాతీయ జెండా త్వరలో రెపరెపలాడనుంది. జిల్లాలోని రెండో అతిపెద్ద జాతీయ జెండాను గ్రామంలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 7లక్షల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నారు. రెండు నెలలుగా జెండా గద్దె తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 53 ఫీట్ల వరకు జెండాను నిర్మించారు. ఇది జిల్లాలో రెండవ అతిపెద్ద జెండాగా నిలవనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏఎన్ఎం మృతి

గన్నేరువరం, ఫిబ్రవరి 12: మండల కేంద్రానికి చెందిన ఏఎన్ఎం న్యాత నీలిమ(38) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. గన్నేరువరంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో సెకండ్ ఏఎన్ఎంగా నీలిమ విధులు నిర్వహిస్తోంది. తోటి ఉద్యోగి మృతి చెందడంతో ఏఎన్ఎంలు, ఆశాలు తరలివచ్చి సంతాపం తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

మానకొండూర్, ఫిబ్రవరి 12: మండలంలోని శ్రీనివాస్ నగర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో వంట మనిషిగా పనిచేసిన అమ్మిగల్ల సరిత ఇటీవల డెంగ్యూతో మృతి చెందగా డీఈవో జనార్ధన్‌రావు, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఆధ్వర్యంలో రెండు లక్షల 83వేల రూపాయాలను సేకరించారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సోమవారం మృతురాలి కుటుంబానికి అందజేశారు.